# మిఠాయికొట్టు

ఈ సంగతీ మూడు దశాబ్దాల నాటిదే! మరీ ఇంత పాతకబుర్లేమిటని విసుక్కోకండి మరి. ఇప్పుడంటే టీ.వీల వాళ్ళూ, పేపర్ల వాళ్ళూ చెప్పవలసిన విధంగా వార్తలు చెప్తే సమయమూ డబ్బు కూడా గిట్టుబాటు కావు కాబట్టి ప్రతి చిన్న విషయాన్నీ కథగా మార్చి దానికో పేరు కూడా పెట్టి ప్రజలు మీదకి వదుల్తున్నారు గానీ అన్నింటినీ కథలన వచ్చునా? ఏ విషయమన్నా కాస్త స్వారస్యం కలిగి ఉండి పాతపడ్డాక కదా కథ అయ్యేది! ఊరేయకుండా ఊరగాయ అనకూడదు గదా.

అప్పట్లో బొంబాయి నుంచి హైదరాబాదు వరకు ఒకటే రైలుండేది. ఇంక ఆంధ్రాలో ఏ ఊరెళ్ళాలన్నా హైదరాబాదొచ్చి ఇంకో రైలు పట్టుకోవాల్సి వచ్చేది. కాకినాడలో చెల్లెలి పెళ్ళికెళ్ళాలని ప్రయాణం పెట్టుకున్నాను. మా పెద్దమనిషి ఎలాగూ ఎక్కడికీరారు కాబట్టి ఆయనకి వండిపెట్టేందుకుగాను మా అత్తగారు ఉండిపోయారు. ఇంక నేనే ధైర్యంగా బయలుదేరాను 3, 2 ఏళ్ళ వయసు గల మా చిరంజీవులిద్దర్నీ వెంటపెట్టుకుని. మరి మగవాళ్ళని అటువంటి ధైర్యం చేయమనండి చూద్దాం! ఊరికే ఆదేశాలివ్వడం తప్ప వాళ్ళవల్ల ఏ పనీ కాదు. నేనెంత చదువుకున్నా, మంచి ఉద్యోగమే చేస్తున్నా, మొగుడు చెప్పినట్లు తు.చ తప్పకుండా వినఖర్లేదు అని ఎవరూ నేర్పకపోవడం వలన నేను మా ఆయన చెప్పినట్లే వినేదాన్ని. ఎప్పుడూ ఇల్లు ప్రశాంతంగా ఉండేది.

మా ఆఫీసు వాళ్ళు నేనున్నా లేకపోయినా పనిలో తేడా పడదని తెలిసిన వాళ్ళవడం వల్ల ఎంత సెలవైనా వాడుకోమన్నారు. మా ఆయన మాత్రం వెళ్ళడానికి రెండు, రావడానికి రెండు, అక్కడుండడానికి రెండు మొత్తం ఆరు రోజుల సెలవు సాంక్షను చేశారు. ఇదెక్కడి న్యాయం అని నేను గొడవపెడితే 'నువ్వెలాగూ ఏదో కథ చెప్పి ఇంకోరోజు పొడిగిస్తావు కాబట్టి ప్రస్తుతానికిది చాల్లే' అని నా అప్పీలు కొట్టి పారేశారు. ఆడవాళ్ళూ పిల్లలూ ఊరెడుతుంటే ఎవరో ఒకరు ఆటో పిల్చుకు రావడం, స్టేషను దాకా వచ్చి రైలెక్కించడం లాంటి ఫ్యూడల్ పద్ధతులు మా ఇంట్లో లేవు కాబట్టి చాలా పనుందని చెప్పి పొద్దున్నే ఈయన ఆఫీసుకెళ్ళి పోయారు. బొంబాయి రైలు మా ఊరికి అయిదు గంటలకి వస్తుంది. ఇంక మా పిల్లలు గంటకొకటి చొప్పున తినేందుకు వీలుగా

అత్తగారు ఓపిగ్గా పాక్ చేసిన రకరకాల తిళ్ళు మూటగట్టుకుని, వెళ్ళేది పెళ్ళికి కదా అని చెప్పి ఆవిడ చేతికున్న గాజులు కూడా నా చేతికి వేసుకుని స్వయంగా ఆటో పిల్చుకుని స్టేషను చేరాను. మా స్టేషన్లో బొంబాయి నుంచి వచ్చే ఆ రైలు పది నిమిషాలు కూడా ఆగదు. కనీసం సామాన్లు చూస్తుండమని అప్ప చెప్పే వయసు కూడా లేదు మా పిల్లలకి ... ఒక పోర్టరుని సామాన్లు మోసేందుకు, ఇంకోడ్ని పిల్లల్నెత్తుకునేందుకు పెట్టి వెనకాలే నడుచుకుంటూ వచ్చి రైలెక్కాను. నాది ఒక్కటే టిక్కెట్టు. మా వాళ్ళిద్దరు టిక్కెట్‌లెస్ ట్రావెలర్సు. దాంతో మా ముగ్గురికీ కలిపి ఒకటే బెర్తు. అదృష్టం కొద్దీ నాది లోయరు బెర్తవ డంతో స్థిమితంగా కూచుని ఇద్దరు కూలీలకీ డబ్బిచ్చి పంపేశాను. సామాన్లు సర్దుకోవడం పూర్తవకుండానే 'గంటయి పోయిందీ', 'గంటయిపోయిందీ' అని మా పిల్ల ఒకటే గోల. 'సరే పద' అని బయల్దేరబోతే "అదికాదు! బామ్మ చెప్పలే! గంటకోటి తినాలని" అని అంటూ అదీ, "గంత! గంత" అంటూ సరిగ్గా మాటలు రాని దాని తమ్ముడూ చేతులు చాచుకుని నిలబడ్డారు. ఇదేదో డాక్టరు ప్రిసిప్షను లాగా ఇంత ఖచ్చితంగా వాళ్ళకే చెప్పాలాబ్బా అని విసుక్కుంటూ డబ్బాలోంచి చేతి కందిన రెండు పాకెట్లు తీసి వాళ్ళ చేతిలో పెట్టాను. అవి తింటూ కిటికీ దగ్గిర కూచుని చెట్లు చూసుకోవడం మొదలుపెట్టారు. నా దగ్గిరుంటే పిల్లలు ఎంత ముద్దుగా నేను చెప్పనట్లుగా వింటారో! మరి అత్తయ్యగారలా ఎందుకు చెప్తారో రోజంతా అల్లరి చేశారని! నా కయితే అనుమానమే వాళ్ళ బామ్మే వీళ్ళతో ఏదో ఒక అల్లరి చేయిస్తుంటారని!

మా ఎదుటి బెర్తు మీద భార్యాభర్తలు తెలుగు వాళ్ళలాగానే ఉన్నారు. ఆయనకి ఒంట్లో బాగాలేదేమో పూర్తిగా దుప్పటి కప్పుకుని పడుకున్నాడు. అవిడ సాంప్రదాయం ప్రకారం ఆయన పాదాల దగ్గర కూచుని ఎవరితో మాట్లాడాలా అని చూస్తోంది. ఆవిడ ఒంటినిండా నగలే! ఎక్కడా రైలు ప్రయాణం చేస్తున్నట్లు లేదు. మంచి గుంటూరు జరీ చీర, తలనిండా పూలు. తెలుగు వాళ్ళు లక్ష్మీదేవికి చేసే రూపకల్పనలాగా ఉంది. రంగు కూడా నలుపే! మరి అసలు లక్ష్మీదేవి ఏ రంగులో ఉంటుందో! నలుపో తెలుపో! లేకపోతే అన్ని రంగుల్లో ఉంటుందో! కిటికీ దగ్గర కూచున్న మా అమ్మాయి దాని చేతిలో ఉన్న జంతికలో విరిగిన ఆఖరి చిన్ని ముక్క తమ్ముడి చేతిలో పెడుతూ "ఇప్పుడొక గంటయి పోయింది గదా! ఇంకో డెబ్బై గంటలయితే అమ్మమ్మా వాళ్ళ ఊరొచ్చేస్తుంది. మళ్ళీ ఇంకో నూటాడెబ్భై గంటలైపోయాక మనం బామ్మ

దగ్గరకెళ్ళిపోతాం" అని తమ్ముడికి ధైర్యం చెప్తోంది! బామ్మ అన్నమాట విన బడగానే వాడు నా మీదకి దూకి 'బామ్మ' అని నాకార్డరేశాడు. సరే అనగానే వెళ్ళిపోయి వాళ్ళ అక్క దగ్గర కూచుని దాని మార్గదర్శనం కోసం ఎదురు చూడసాగాడు.

'తమరు బామ్మార్లాండీ?" అనడిగిందావిడ. 'అవునూ' అన్నాను. కాస్త గర్వంగా! ఆ రోజుల్లో బ్రాహ్మలమని చెప్పుకునేందుకు మరీ ఇప్పట్లా సిగ్గుపడే వాళ్ళం కాదు. ఎదుటి వాళ్ళు కూడా నచ్చితే మనని గౌరవించేవారు. లేకపోతే మాట్లాడక ఊరుకునేవారు. అంతేగానీ ఒకరంటే ఒకరికి ద్వేషం కానీ, అసూయ గానీ ఉండేది కాదు. అది ఒక విషయమని అనుకునే వాళ్ళమే కాదు.

"అమ్మా! చెట్లు పరిగెడుతున్నాయి" అంది మాపాప. "కాదమ్మా! చెట్లు కదలవు! మనమే పరిగెడుతున్నాం!" అన్నా. మా వాడు వెంటనే కాళ్ళు నా వళ్ళో పెట్టి 'నెప్పలుతున్నాయ్' అని కళ్ళు చికిలించాడు. ఆడుకుంటూ ఆడు కుంటూ మధ్యలో వచ్చి కాళ్ళు పట్టించుకుని వెళ్ళడం వాడికిష్టం. మా అత్తగారు వాడికా అలవాటు చేశారు. మగ బిడ్డట పాపం! రైలెక్కాక కాలం పరిగెడుతూ ఉంటుంది. దాంతో బాటు రైలూ పరిగెడుతూ ఉంటుంది. కదలకపోయినా మన శరీరమూ పరిగెడుతూనే ఉంటుంది. గాబట్టి తెలియకుండానే అలసిపోయి బోలెడు ఆకలీ నిద్రా ముంచుకొస్తాయి. పగలంతా పని చేసి చేసి ఉన్నానేమో నాక్కూడా నిద్ర ముంచుకు రాసాగింది. కానీ సాయంత్రం వేళ నిద్ర దరిద్రానికి దారి తీస్తుందని మా అమ్మ పదే పదే నూరిపోసినందువల్ల ఆ నిద్ర నుంచి తప్పించుకోడానికన్నట్లు ఒక జంతిక తీసి తినబోయి సగం విరిచి ఎదుటి బెర్తావిడ చేతిలో పెట్టాను. మొహమాటపడుతూ వద్దంటూనే తీసుకుంది. నోట్లో పెట్టుకుని నవలబోతే దంతాలకీ శ్రవణేంద్రియాలకీ కూడా పరీక్ష పెట్టసాగాయి.

"కొన్నారాండీ! లేకపోతే మీరే చేశారా?" అనడిగిందావిడ.

"మా అత్తగారు చేశారు ఏం బాగులేవా?" అని అడిగాను.

"బాగుండాయండి! కాని రొంత వరిపిండి తగ్గించి పెసరపిండి కలిపుంటే ఎన్నలాగుండేయండి" అని ఒక టెక్నికల్ ఎడ్వైజు పారేసిందావిడ. ఆవిడ మాటలు వినగానే ముసుగులో ప్రాణి ఒక్క రవ్వ మసిలి "ఏమో! మీకన్నీ మీ యమ్మగారింట్లో మల్లె చేయించకపోతే నచ్చవు గామాల" అన్నాడు. "ఇప్ప డాళ్ళ ఊసెందుగ్గానీ ముందు నువ్వు లెగవయ్యా బాబు! ఎంతసేపా నిద్ర! సంజేళ పడుకుంటే లక్ష్మిదేవి పారిపోద్ది" అని అయన్ని హెచ్చరించింది.

"ఇది ఇల్లు కాదు కదే! అయినా నువ్వుండావుగా పట్టుకోటానికి!" అని అన్నాడు గానీ వెంటనే లేచి కూచున్నాడు. ఎంతైనా లక్ష్మీదేవంటే మాటలు కాదు కదా! ఆవిడ ఉన్నప్పుడూ లేనప్పుడూ కూడా అందర్నీ భయపెడుతూనే ఉంటుంది. భార్యకున్నన్ని నగలు లేవుగానీ ఆయన ఒంటి మీద కూడా బాగానే ఉన్నాయి. మెడలో రెండు పెద్ద గొలుసులు, చేతికి మురుగులు, బంగారం వాచీ, రకరకాల రాళ్ళలో నాలుగు ఉంగరాలు! చామన ఛాయ మనిషి! వయస్సు ఏభై పైమాటే! సిల్కులాల్చీ. అంతో ఇంతో ఉన్న వాళ్ళేనని తెలుసు కోడానికి పెద్ద శ్రమపడక్కర్లేదు. మొఖాలు కూడా తేటగానే ఉన్నాయి. భగ వంతుడు మరీ భయంకరమైన పరీక్షలేవీ పెట్టినట్టు లేదు. ఆయన మాత్రం అందరిజోలికీ ఎందుకు వస్తాడు? ఈ భూలోకవాసులు కొంత మినిమమ్ స్టాండర్డుకి రీచయి పేపర్లలో పేరుపడడం మొదలయ్యాక అప్పుడు పరీక్షిస్తాడు. హరిశ్చంద్రుడి సత్యనిష్ఠనీ, రాముడి పితృభక్తినీ, ధర్మరాజు ధర్మనిరతినీ, కర్ణుడి దానగుణాన్ని మినిస్టర్ల వాగ్దానాలనీ పరీక్షించినట్లు. దేనికైనా సమయమూ, కనీ సార్థతా ముఖ్యం. మనిషి తన స్వశక్తి మీద పైకొచ్చాననుకున్నప్పుడు పైవాడు ప్రతాపం చూపిస్తాడు. పరీక్షలు పెడతాడు. గెలిచిన వారు చరిత్రకెక్కుతారు. నిలబడలేని వాళ్ళు సాదా సీదా జనంలో కలసిపోతారు.

చూస్తూ ఉండగానే చీకటిపడిపోయింది. మా అత్తగారు సర్ది ఇచ్చిన టిఫిను బాక్సులు రెండూ మా పిల్లలిద్దరికీ ఇవ్వగానే బంగారాల్లాగా తినేశారు. అది చూసి ఎదుటావిడకి ముచ్చటేసింది!" ఎంత బుద్ధిగున్నారమ్మా! ఎంతయినా మీ పెంపకాలే వేరు. చదూకున్నోళ్ళు గదా! మా మనవడికి అన్నం పెట్టాలంటే వాడ్ని చంకనేసుకుని పదిసార్లు డాబా ఎక్కిదిగాలి" అంది.

నాకు ఆశ్చర్యం వేసింది "అప్పుడే మనవలున్నారా మీకు?" అని అడిగాను. "ఒకరు కాదు ఇద్దరు కాదు ఏడుగురు మనవలున్నారు. అందరిలోకీ పెద్దవాడు టెన్తులోకి వచ్చాడు" అని గర్వంగా చెప్పిందావిడ. "మీకు మల్లే ఉద్యోగాలు వెతుక్కోవక్కర్లేదు కదండీ! నాకు పద్నాలుగేళ్ళకే పెళ్ళయింది. ముప్పై అయి దేళ్ళకే మనవడ్నెత్తాను" అని వివరించింది.

"మీది బట్టల దుకాణమా?" అని అడిగాను. "కాదండి! మా తాతల కాడ్నించీ మాది మిఠాయి వ్యాపారమే! బందరు మిఠాయి అని అంటారు చూడండి. అది మొట్టమొదటిసారి మా పెదమామ గారి తాతగారు చేశారటండి. తెల్లదొరలు కొనుక్కుని దొరసానులతో వాళ్ళ దేశాలకి కూడా పంపే వార టండి!" అని చాలా అతిశయంగా చెప్పింది.

"ఎప్పటి సంగతో ఎందుకే! మొన్న మనం పదివీశల లడ్డు పట్టుకెడితే బొంబాయి వాళ్ళు క్షణాల్లో ఊదేయలేదూ! అన్ని లడ్డులు చేస్తారుగానీ మన తొక్కుడు లడ్డులు చేయమను చూద్దాం. వాళ్ళ హల్వాలేవీ మన బందరు హల్వా కాలిగోటికి కూడా పోలవు" అని మాట కలిపాడు. కానీ వెంటనే మళ్ళీ దిగులు పడ్డ వాడిలా అయిపోయి కిటికీలోంచి బయటకు చూస్తూ ముభావంగా అయిపోయాడు.

"బందర్లో మొత్తం మాకు మూడు దుకాణాలుండాయండి. మా పెద్దల కాడ్నించి వచ్చింది కోనేరు సెంటర్లో ఉందండి. రెండోది రామాయంపేటలో ఇరవై ఏళ్ళ క్రితమే పెట్టామండి! ఇగో మొన్నీ మజ్జనే పెడన సెంటర్లో మూడోది పెట్టామండి."

"మూడు దుకాణాలూ ఈయనొక్కరే చూసుకుంటారా? మరి మీరు ఇన్ని రోజులు లేకపోతే ఇబ్బంది కాదూ?" అని అడిగాను.

"ఇబ్బందెందుకండీ? నాకు ముగ్గురు కొడుకులున్నారు కదా! రెండోవాడికీ, మూడో వాడికీ చెరొకటీ ఇచ్చేశామండి. లాభం నష్టం అన్నీ వాళ్ళవే! పెద్దది మాత్రం ఈయన చూసుకుంటారండి. ఏనాటి నుంచో పని చేస్తున్న పంతులు గార్లున్నా రండి. పైసా తేడా రానీయరండి పాపం! ఆళ్ళమీద భరవసాతోనే మేం ఇట్టా బయలుదేరాం! మే పుట్టి బుద్ధెరిగాక బందరొదిలి ఇంతదూరం రావడం ఇదే మొదటిసారి" అంది.

"మరి బొంబాయిలో మీ అమ్మాయి వాళ్ళున్నారా?"

"నాకాడపిల్లల్లేరండి. ముగ్గురూ మగమారాజులే! బొంబాయిలో ఉన్నది మా పెద్దాయనండి. స్కూల్లో బామ్మర్లతో పోటీపడి చదివేవోడండి. ఆ తెలివి చూసి మురిసిపోయి ఇంకా ఇంకా చదివించాలని బోలెడు ఖర్చుపెట్టి బొంబాయి కూడా పంపిచ్చి చదివిచ్చామండి. ఆయన చదువులన్నీ చదివి ఇంక చస్తే మనూళ్ళో వ్యాపారానికి రానని చెప్పి ఇక్కడే ఉండి పోయాడండి. ఆడు వ్యాపారానికి రాకుండా ఇంకోరికాడ కొలువు చేస్తున్నాడని ఇగో పదిహేనేళ్ళయినా మా ఆయనకి కోపం పోలేదండి. ఆడి దెబ్బతో హడలెత్తిపోయి చిన్నాళ్ళిద్దర్నీ స్కూలు ఫైనలు కాగానే దుకాణాల్లో పెట్టేశామండి" అని చెప్పి మొగుడుకేసి తిరిగి "ఇదిగో! ఎంతసేపు చూత్తావా కిటికీలోకి! చీకట్లో ఏం కనిపిస్తాంది నీకు? అంత పెద్ద ఊళ్ళో అంత పెద్ద మేడలో నా కొడుకు దర్జాగా

బతకతా ఉంటే దుకాణం మీద కూకుని ఎవడొత్తాడా అని ఎదురు చూడట్లేదని కోపం ఒకటి నీకు!"

"ఛ! వాగమాక! వాడూసు కాదన్నానా!" అని బదులిచ్చాడు గానీ తల తిప్పలేదు. "మరి ఇంకేంటంట! అక్కడున్నాన్నాళ్ళూ సంబడంగానే ఉండావుగా! బయల్దేరే టయానికేమొచ్చింది? మళ్ళీ వాడ్నేమన్నా అన్నావా?" అని ఆరా తీసింది.

"వాడి మీద కోపం కాదన్నానా! మనిళ్ళల్లో ఎంత పనికిమాలిన వోడైనా ఇంకోడికాడ కొలువు చేస్తాడా! బొంబాయి కాలేజీకి పంపిచ్చి ఇంత చదివిచ్చాం కదా! అంత తెలివి మాలిన వాడెట్టా అయ్యాడా అన్నదే నా బాధ" అని కొంత గోడు వెళ్ళబోసుకున్నాడు.

"ఏ తెలివీ లేని వాడైతేనే పిల్చి అంత జీతమిస్తున్నారంటావా?"

"ఇంకోసారి జీతమన్నావంటే చంపేస్తా!" అని కళ్ళెర్ర చేశాడు.

"ఏంటో! నీతో నాకు మాటలెందుకు! నీ కోపికున్నంత బాధపడుకో" అన్చెప్పి నాతో కబుర్లలో పడింది. పెద్దకోడలు పిల్ల మంచిదేగాని ఫాషన్లెక్కువట. ఒక్క నల్లపూసల గొలుసు జత గాజులు తప్ప ఏ నగలు వేసుకోదుట. ఆ అమ్మాయి బందరొచ్చినా అలాగే ఉండడంతో వాళ్ళ అబ్బాయికి బొంబాయిలో చాలా పెద్ద ఉద్యోగం అని చెప్పినా వాళ్ళ వాళ్ళెవరూ నమ్మడం లేదుట. ఎవరు చూస్తున్నా మొహమాట పడకుండా మగడి వెనుక స్కూటరెక్కి వెడు తుందిట. ఇవన్నీ చెప్పి చెప్పి 'ఇంక నేనాకలికి ఆగలేనండి' అంటూ కారియర్లు తీసింది. అన్నీ సర్దుతూ "మా ఇళ్ళల్లోవి తింటారాండీ" అనడిగింది. "ఎందుకు తినరే! పగలంతా తడిబట్టలతో తిరిగే చైనులు గారి మేనత్త సంజేళప్పుడు మనవడ్ని పంపి మెత్తటి ఉల్లిపాయ పకోడీలు తెప్పించుకోదూ!" అన్నాడు.

"ఛ ఊరుకో! పెద్దోళ్ళనంటే కళ్ళు పోతాయ్!"

"ఆవిడ తింటే పోవుగానీ నేనంటే పోతయ్యా! నువ్వు ముందు అమ్మాయి గార్కి పెట్టు" అన్నాడు. నాక్కూడా కొంచెం పులిహోర వడలు పెట్టి ఇచ్చారు. అందరివీ కలిపి భోజనాలు కానిచ్చాం. ఆవిడ చెయ్యి కడుక్కోడానికి వెళ్ళి నప్పుడు "ఆవిడగారు మీతో తను ఆకలి కాగలేనన్నది కదండీ! ఇప్పుడు చూడండి" అన్నాడు. ఆవిడ వస్తూనే ఆయన్ని కిటికీ వైపున జరగమని ఒక్క కసురు కసిరి ఆయన వళ్ళో దిండుపడేసి దాని మీద తలపెట్టుకుని ఒకే ఒక

నిమిషంలో నిద్రపోయింది. 'నే చెప్పానాండీ!" అని ఆయన నవ్వాడు. నేను కూడా కిటికీ పక్కన సర్దుకు కూచుని పిల్లల్ని బెర్తుమీద చెరోవైపు తలపెట్టి పడుకోపెట్టాను. నిద్దరపోవాల్సిన వాళ్ళు నిద్దర్లుపోయారు కాబట్టి మిగిలిన మేం ఇద్దరం కబుర్లల్లో పడ్డాం.

"అమ్మాయి గారూ! పిల్లల నాన్నగారేం చేస్తారండీ?" అని మొదలు పెట్టాడు.

"చాలా పెద్ద లాబ్‌లో ఒక చిన్న ఉద్యోగం" అన్నాను.

"మరి మీరు ఏదన్నా స్కూల్లో టీచరాండీ" అనడిగాడు. అబ్బే! నేనూ అక్కడే! ఇంకో చిన్న ఉద్యోగం. పిల్లలు మా అత్తగారి పెంపకం" అన్నా. "చూస్తానే తెలుస్తోందండి. బొంబాయిలో మా మనవడున్నాడా! ఆడికంతా వాళ్ళ అమ్మేనండి. మనమేం చెప్పినా ఆవిడకి కోపం వచ్చి అడ్డి బాదేస్తాదండి. ఇంకొన్నాళ్ళుందామనుకున్నాం గానీ చాతకాలేదండి" అన్నాడు.

"బొంబాయిలో మీ అబ్బాయి ఏ పని చేస్తున్నారు?" అనడిగా.

"మా ఆవిడ చెప్పింది కదండీ! మీకు మల్లేనే ఆడికీ ఏదో పెద్ద కంపెనీలో ఇంజనీరుద్యోగమంట. ఎంతుద్యోగమైతే మాత్రం ఏం సుకమండీ! వాళ్ళ ఇల్లంతా కలిపి మా ఇంటి నడవంత కూడా ఉండదు. నలుగురం వెళ్ళామంటే వంట గదిలో కూడా పడుకోవాల్సిందే! నాలుగంతస్తులు ఎక్కాల! దిగాల! పాల సీసాలు పేపర్లు అన్నీ బుట్ట కిందికీ పైకి లాక్కోవాలండి! వాడు ఏడు గంటలకి వెళ్ళిన వాడు మళ్ళీ రాత్రి తొమ్మిదింటికి ఇంటికి రావడం. అన్ని పనులూ కోడలే. ఎవరికీ సుఖం లేదు" అని నిట్టూర్చాడు.

"ఏమో మీరలా అనుకుంటున్నారు! వాళ్ళకిలాగే బాగుందేమో! స్వతంత్రం ఉన్న చోటే స్వర్గలోకం అంటారు కదా! ఎక్కడుంటే అక్కడే బాగుందనిపించడం మనిషి సహజ స్వభావం. కొద్దిమంది మాత్రమే కొత్తదారి పడతారు" అన్నా.

"అదేనండి! వీడలాంటివాడే! మీలాటి వాళ్ళ కంటే ఉద్యోగాలు తప్పవండి జీతాల మీద బతకాలి. మాకలా కాదు కదండీ! అసలు ఉద్యోగం చేసేవాడంటే పిల్లనివ్వరండి మాలో. కాకపోతే మా అదృష్టంకొద్దీ వీడికి డిగ్రీలో ఉండగానే బచ్చువాళ్ళమ్మాయి నిచ్చారు కాబట్టి సరిపోయిందండి. చదువుకుంటే వ్యాపారం చేయకూడదని రూలుందాండీ! ఎంత పెద్ద ఉద్యోగమైనా జీత గాడికిందే లెఖ్ఖ కదండీ" అన్నాడు.

"ఇట్టా వాగేవాడివి కాబట్టే కోడలు నీతో మాట్లాడేది కాదు" అని ఆవిడ నిద్దట్లో గొణిగింది.

అప్పటికి రాత్రి పదవడంతో మధ్య బెర్తులు వాల్చడానికి అందరూ లేవాల్సి వచ్చింది. దుప్పట్లన్నీ పరుచుకుని అందరూ నిద్రకు ఉపక్రమించారు. నేను కూడా ఏదో కాస్త జాగా చేసుకుని పడుకునే ప్రయత్నం చేశాను. కాని అంత అస్తవ్యస్తంగా పడుకుంటే నాకెప్పుడు నిద్దర పట్టాలి! ఉద్యోగం చేయడమంటే ఇంత హీనంగా భావించే వాళ్ళుంటారా? అసలింతకీ ఏమిటీయన బాధ! కొడుకు దూరంగా ఉన్నాడనా? ఉద్యోగం చేస్తున్నాడనా? వ్యాపారం చేయట్లేదనా? ఆ అబ్బాయి స్వయంకృషితో సాధించిన వేవీ ఈయనకి ఆనట్లేదా? ఈయనని చూస్తుంటే విషయం ఇంకా ఏదో ఉన్నట్లనిపిస్తోంది! అలా అలా ఆలోచిస్తూ ఎప్పటికో నిద్దట్లోకి జారుకున్నాను. తెల్లవారేటప్పటికి హైదరాబాదులో దిగిపోతాం కదా అని ఎంతో ధైర్యంగా ఉన్నాను. అన్నీ మనం అనుకున్నట్లు జరిగితే లేనిదేం ఉంది! మేం మంచినిద్దట్లో ఉన్నప్పుడు రైలు కూడా పట్టాల మీద నాలుగ్గంటలు నిలబడే నిద్దరచేసిందట. తెల్లవారేటప్పటికి హైదరాబాదులో ఉండవలసిన వాళ్ళం షోలాపూరు స్టేషన్లో ఆగివున్నాం.

పెద్ద స్టేషన్లో రైలాగడం చూసి ఆయన గబగబా దిగి వెళ్ళి బోలెడు ఇడ్లీ పొట్లాలు తీసుకువచ్చాడు. వద్దండీ అంటున్నా వినకుండా మా పిల్లలిద్దరికీ చెరో పొట్లం ఇచ్చాడు. వాళ్ళ కిడ్లీలు సయించవని నేనిచ్చిన స్టేట్‌మెంటు పచ్చి అబద్ధమని నిరూపిస్తూ ఇద్దరూ తినేశారు. అ తరువాత ఎన్నో ఏళ్ళు, పొట్లం లోంచి ఇడ్లీ తింటే ఎంత బాగుంటుందో చెప్పుకునే వారు. ఇంకా అయిదు గంటల ప్రయాణం ముందుందని గ్రహించడంతో ఎక్కువ బెట్టు చేయకుండా నేను కూడా ఫలహారం కానిచ్చాను ... పై బెర్తాయన మరి ఎక్కడ దిగిపోయాడో అది ఖాళీగా ఉండడంతో, ఇడ్లీల ఫలహారం అయ్యాక మా ఇద్దరి సహకారంతో ఆవిడ పైబెర్తు ఎక్కి దుప్పటి కప్పుకుని హాయిగా సెటిలైపోయింది. నేనూ ఆయనా మళ్ళీ కబుర్లల్లో పడ్డాం.

"ఎప్పట్నించో అడుగుదామనుకున్నా గాని మీరేం అనుకుంటారోనని సంశయించానండి. ఆడపిల్లల కింతింత చదువులు చెప్పిస్తే పెళ్ళిళ్ళు చేయడం కష్టమవదాండీ! మీ పుట్టింటారు బాగా కలిగినోళ్ళాండీ?" అనడిగాడు.

నాకైతే నవ్వొచ్చింది. "చదువుకుంటే పెళ్ళి చేయడం తేలికవుతుందని మా వాళ్ళనుకుంటారండి. మా అమ్మ వాళ్ళు చాలా సామాన్యులు. చదువుకోగల

గడం నా అదృష్టం. నిన్న రాత్రి మీరు ఉద్యోగాలు చేసే వాళ్ళంటే ఎంతో తేలికగా మాట్లాడారు. మీవి వ్యాపార కుటుంబాలు కాబట్టి ఉద్యోగస్థుడంటే పిల్లనివ్వరు. అలాగే మా ఇళ్ళల్లో లక్షల్లో వ్యాపారం చేస్తున్నాడన్నా ఎవ్వరూ పట్టించుకోరు, అలాంటి వాళ్ళకి అమ్మాయి నిచ్చి గొంతుకోయలేం అంటారు! డబ్బు అనేది ఎప్పటికైనా పోతుందనీ మా వాళ్ళందరికీ గట్టి నమ్మకం! అదే ఏ బ్యాంకులో గుమస్తా అన్నా, రైల్లో గార్డన్నా, స్కూల్లో టీచరన్నా ఎగిరి గంతేసి అప్పుచేసి అయినా సరే కట్నాలిచ్చి పెళ్ళిచేస్తారు." నా మాటలు విని ఆయన గట్టిగా నవ్వాడు. "మీరు చదువులకంత గౌరవమిస్తారు కాబట్టే ఆడపిల్లల్ని కూడా దూరాలు పంపిచ్చి చదివిస్తారండి. మా అబ్బాయి పై చదువులకని బొంబాయి వెడతానని పట్టుపట్టడం మాకెవ్వరికీ సుతరాం ఇష్టం లేకపోయింది. చివరికి మా వియ్యంకుడు గారే వచ్చి కాలేజీలో చేర్పించి వచ్చాడు. ఆ తర్వాత వీడెన్నిసార్లు మమ్మల్ని రమ్మని బతిమిలాడినా 'ఏం ఉంటుందిలే అక్కడ' అని ఇల్లు కదలలేదు" అని చెప్పుకొచ్చాడు.

"పోనీ! ఇప్పటికైనా వెళ్ళారు కదా! మరి బొంబాయిలో ఏ విశేషం కనిపించ లేదా?" అనడిగాను.

"అదే! అదే! బొంబాయి నగరంలో నచ్చకపోడానికేం ఉంటుందండి. అంతా లక్ష్మీనిలయం. ఎవడి శక్తిని బట్టి వాడు సంపాదించుకోడమే! మేం సామాన్లన్నీ సర్దుకోడం అయ్యాక మా వాడు 'నాన్నా! బాబాయికి తమ్ముళ్ళకీ బొంబాయి స్వీట్లు రుచి చూపిద్దువుగాని, ఇక్కడికి దగ్గర్లో మంచి దుకాణం ఉంది. మనిద్దరం వెడదాం' అని నన్ను స్కూటరెక్కించుకుని తీసికెళ్ళాడు. తీరా చూస్తే అది ఒక పెద్ద సినిమా హాలంత ఉందండి. అక్కడ సోఫాలో నన్ను కూచోమని వాడు కౌంటరు దగ్గరకెళ్ళాడండి. ఒకటే జనం. అందరు క్యూలో నిలబడి వారి వారి వంతు వచ్చాక కావల్సినవి కౌంటర్లో ఆర్డరిచ్చి చీటీ తీసుకుని వచ్చి నా పక్కన కూచుంటున్నారు. చీటీ నంబరు పిలవగానే వెళ్ళి డబ్బు కట్టి వాళ్ళ సరుకు తీసుకుపోతున్నారు. వంద రూపాయలకు తక్కువ సరుకు ఎవడూ కొనట్లేదు. ఎంతమంది జనమో! ఎన్ని రకాల స్వీట్లో! మనూళ్ళలో దీపావళి పండక్కూడా అంత బేరాలుండవు. అసలు మామూలు రోజుల్లోనైతే బంగారం లాంటి మిఠాయిలు చేసినా కొనే వాడుండడు. అరకిలో ఉల్లిపకోడీలు, నాలుగు బెల్లం జిలేబీలు కొంటే గొప్ప! మరి దుకాణమన్నాక నాలుగు రకాలు చేసి ఉంచాలి కదా! మూడు రోజులు కౌంటర్లో ఉంచి మిగిలినవన్నీ అద్దాలబళ్ళ కేసేస్తామండి. నిలవ సరుకంటే పేరుపోద్ది" అన్నాడు.

"రోజుకి వందల కోట్లలో వ్యాపారం జరిగే బొంబాయి మహానగరానికీ, ఒక పక్కన ఒదిగి ఉన్న మన బందరుకీ సాపత్యమెక్కడ? బందర్లో ఎవడన్నా రుచులు కోరేవాడున్నా కొనే స్థోమత ఉండాలి కదా! బొంబాయిలో ఎవరికీ డబ్బు లక్ష్యాలుండవు. రేపెలాగన్న చింతుండదు ఎవరికీ. ఆ రూపాయి పుడు తుందనే కదా ఎక్కడెక్కడి వాళ్ళో వచ్చి ఇక్కడ చేరేదీ! కానీ ఈ మహానగరంలో వ్యాపారం చేయడం కూడా అందరివల్లా అయ్యేపని కాదు. పెట్టుబడే లక్షల్లో ఉంటుంది. స్థలం దొరకాలంటే సాధ్యంకాదు. ఇంకా ఏయేం సమస్యలుం టాయో ఎవరికి తెలుసు! పైకి అన్నీ బాగానే ఉంటాయి. దిగితే కదా లోతు తెలిసేది" అన్నాను.

"ఎలాగా అన్నది పక్కన పెట్టండి. అసలిలాటి ప్రపంచం ఓటుందనైనా తెలియాలి కదా! ఇన్ని అవకాశాలున్నాయని తెలిస్తే నలుగుర్ని కలుపుకునైనా ఏదో ఒకటి చేసే వాడ్ని. వయస్సులో ఉండగా నాలుగు విషయాలు తెలియక పోవడం వల్ల పెద్ద పొరబాటు జరిగిపోయింది. నేనేదో పెద్ద తెలివైన వాడినని మా బంధువులందరికీ నమ్మకం గానీ ఏం లాభం. బావిలో కప్పలాంటి బతు కైందని ఇప్పుడు తెలుసుకున్నాను. మా అబ్బాయి పిల్చినప్పుడు ఒకసారి కాక పోతే ఒకసారన్నా వచ్చి ఉంటే ఎంత బాగుండేది! అవకాశం వదులుకునేవాడ్నా! పోనీ మా వాడన్నా ఇక్కడి వ్యాపారావకాశాల గురించి ఒక్క ముక్క చెప్పచ్చు కదా! అయినా నా తెలివితక్కువ గానీ వాడికే ఈ ఆలోచనుంటే లేనిదేవుంది!" అని చాలా బాధపడ్డాడు.

ఏది పోయినా సంపాయించుకోవచ్చు గానీ పోయిన కాలాన్ని వెనక్కితేలేం కదా! అందుకేనేమో పూర్వం విద్యాభ్యాసం కాగానే దేశాటనం చేయమనేవారు. కాసేపు ఏమీ మాట్లాడలేకపోయాను. కానీ ఆయన బాధ అంతా తెలిశాక ఏదైనా మంచి సలహా ఇవ్వాలి కదా! మీ కంటే వయసైపోయింది కాబట్టి కొత్త ప్రయత్నాలు చేయలేరు. కానీ ఇంకా మీకు ఇదే లైన్లో ఉన్న కొడుకులిద్దరు న్నారు కదా! వాళ్ళని ప్రయత్నం చేయమనండి" అని ధైర్యం చెప్పబోయాను.

"చూద్దాం. వాళ్ళకా కోరిక, పట్టుదల ఉండాలి గందా! వాళ్ళ భార్యలు వప్పుకోవాలి. ఇవన్నీ జరిగే పనులేనా!" అని ఆలోచనలో పడ్డాడు.

పైనుంచి ఆయన ఇల్లాలిగారి గొంతు వినిపించింది. కిందకి దిగుదామా అని చూస్తున్నట్లుంది. "ఏమయ్యా! నీకా పేద్ద దుకాణం చూసి మతి భ్రమిసి నట్లుందే! నాకూ అట్టానే అయిందిలే."

"నీ దుంపతెగ! నీకేమయిందే!"

"అఁ... ఏం లేదులే! చిన్నప్పుడే తొందరపడి నిన్ను కట్టుకోకుండా, ఇక్క డెవరన్నా పెద్ద సేటుని కట్టుకునుంటే ఇంకెంత వైబోగాలుండేయోనని."

"చంపేస్తానోసేయ్! నీ నోరు మహాలెగుస్తోంది! కిందకు దిగు నీ పని చెప్తా" అని చెయ్యందించాడు.

ఇద్దరూ గట్టిగా నవ్వుకున్నారు.

**2008**, నవ్య దీపావళి ప్రత్యేక సంచిక

✦ ✦ ✦